క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

వెలుగోడు: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం వేల్పనూరు గ్రామంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 18 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తుందన్నారు.

పంటల మార్పిడితో అధిక లాభాలు


పంట పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: పంటల మార్పిడితో రైతులు అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాలలో ఏఓ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని 11 అంకెల ఐడీ పొందిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నగదు జమ అవుతుందని, సాగు భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ తెలిపారు.

శివాజీకి ఘన నివాళి


శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వెలుగోడు: స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకుడు కృష్ణార్జునరెడ్డి, బీజేపీ నాయకులు వెంకటరెడ్డి, ప్రతాపచారి, పార్థసారధి రెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, జగదాంబ సుధాకర్, సంపత్, నాగరాజు శివ తదితరులు మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్య దురాగతాలను అనగదొక్కి,హైందవ సామ్రాజ్యాన్ని నెలకొల్పిన గొప్ప నాయకుడు ఛత్రపతి శివాజీ అని వక్తలు కొనియాడారు.

బడ్జెట్‌లో అన్యాయం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయానికి జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, నరసింహ నాయక్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్.స్వాములు, మండల నాయకులు మాబాషా అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం నుంచి గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరన్న, కిరణ్, గణపతి, మల్లయ్య, హుసేన్‌బాషా, రఫీ, నాగమోహన్, వెంకటయ్య, బాషా, ఎర్రబాషా, కిషోర్, కృష్ణ, నూరుల్లా, రవి పాల్గొన్నారు.

డస్ట్ బిన్లు లేకపోతే చర్యలు

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలోని వ్యాపారులు దుకాణాల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోకపోతే చర్యలు తీసుకుంటామని మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హోటళ్లు, తోపుడు బండ్ల వ్యాపారులు, కాంప్లెక్స్‌లో వ్యాపారాలు నిర్వహించుకునేవారు తప్పనిసరిగా షాపుల ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ ముర్తుజావలి(51) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలేకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఏఎస్‌ఐ రామచంద్రుడు తెలిపిన వివరాలు.. ఈ నెల 8న పటేల్ సెంటర్‌లో కుమార్ మొబైల్ షాపు ఎదురుగా సైకిల్‌పై వెళ్తున్న టైలరు షేక్ ముర్తుజావలి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కర్నూలు పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భార్య షేక్ నసీమాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీలో ఉద్యోగ మేళా

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్లు, శ్రామిక్‌గా శిక్షణ పొందిన అభ్యర్థులకు బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిపో మేనేజర్ గంగాధర్‌రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. డ్రైవర్, శ్రామికులకు సంబంధించిన పలు సూచనలు, సలహాలిచ్చారు. 80మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 52 మంది అభ్యర్థులు డ్రైవర్, శ్రామిక్ పోస్టులకు అర్హత సాధించారన్నారు. అసిస్టెంట్ మెకానిక్ (క్లీనర్) పోస్టుకు హెవీ లైసెన్స్ కలిగి ఉండి అర్హత కలిగిన వారు డిపో మేనేజర్‌ను సంప్రదించాలని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ కిశోర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం.. శివోహం .. భక్తిపారవశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి శివదీక్షా జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఉదయం మనోహరగుండం వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను రథవీధిలో మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఊరేగింపుగా తీసుకునివెళ్లి శివదీక్షా శిబిరాలలో ఆశీనులను చేయించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచారాలతో పూజాదికాలు నిర్వహించారు. శివదీక్షా జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమం పూర్తయ్యేంత వరకు కూడా శిబిరాలలోని దేవతామూర్తులకు త్రికాలాలలో శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపారు. అనంతరం దీక్షా శిబిరాలలోని హోమగుండానికి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా పూజలను జరిపి హోమాగ్నిని ప్రజ్వలింపజేశారు. తరువాత శివదీక్షాధారులు నమశ్శివాయ పంచాక్షరీ నామస్మరణతో శివదీక్షా జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమం ప్రారంభించారు. జ్యోతిర్ముడి సమర్పణాంతరం ఆవునెయ్యి, నారికేళం, మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా భక్తులు సమర్పించడం జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం మార్చి దవ తేది వరకు దీక్షావిరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జనవరి 19న శివమండల దీక్షను, ఫిబ్రవరి 8న అర్ధమండలదీక్షను స్వీకరించిన భక్తులు ఈ దీక్షా విరమణ సమయంలో జ్యోతిర్ముడిని (ఇరుముడిని)సమర్పిస్తారు.


శివదీక్షా శిబిరంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ప్రత్యేక క్యూలైన్ ద్వారా మల్లన్న స్పర్శ దర్శనానికి వెళ్తున్న జ్యోతిర్ముడితో వేచి వున్న శివస్వాములు

జ్యోతిర్ముడి కలిగిన భక్తులకు స్పర్శదర్శనం

శివదీక్షను స్వీకరించి, జ్యోతిర్ముడి కలిగిన భక్తులకు చంద్రవతి కల్యాణ మండపం నుండి ఆలయ తూర్పు మాడవీధి ద్వారా ప్రత్యేక దర్శనం క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఈ క్యూలైన్ ద్వారా నిర్ణీత వేళలలో మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నారు. ఈ నెల 23వ తేది వరకు ఐదు రోజులు మాత్రమే మల్లన్న స్పర్శ దర్శనం కలిస్తారు. శివదీక్ష భక్తులకు సేవలందించేందుకు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.


జ్యోతిర్ముడి సమర్పిస్తున్న శివదీక్షా భక్తులు

'జ్ఞానజ్యోతి'పై అంగన్‌వాడీలకు శిక్షణ

పగిద్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. డీఆర్‌పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ రావు, రంగస్వామి, శేషమ్మ ఎఫ్‌ఎల్‌ఎన్ 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు(జ్ఞానజ్యోతి)పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, సీడీపీఓ కోటేశ్వరమ్మ, హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

పగిద్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఉపాధి పథకాల కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు గురువారం నుంచి ఆయా బ్యాంక్‌ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 20న పగిద్యాల కెనరా బ్యాంక్, 21న యూనియన్ బ్యాంక్ కొణిదేల, 22న ఇండియన్ బ్యాంక్ ప్రాతకోట పరిధిలోని అర్జీదారులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

దుస్తుల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని మిస్టర్ టీ స్టాల్ అధినేత వెంకటేష్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆత్మకూరు హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ కబడ్డీ టీంకు పది జతల క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం మిస్టర్ టీ స్టాల్ అధినేత వెంకటేష్‌ను క్రీడాకారులు పూలమాల, శాలువాతో సత్కరించారు.


మిస్టర్ టీ స్టాల్ అధినేత వెంకటేష్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

దేవతా వస్త్రాల వితరణ

మహానంది: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లతో పాటు మహానందిలోని గరుడనంది, వినాయకనంది ఆలయాల్లో కొలువైన మూల, ఉత్సవమూర్తులకు అవసరమైన దేవతా వస్త్రాలను దాతలు బుధవారం అందించారు. ధర్మవరం పట్టణానికి చెందిన గోరకాటి రఘునాథరెడ్డి, ప్రమీల దంపతులు, వారి కుమార్తెలు స్వప్నారెడ్డి, పూర్ణిమరెడ్డి వేదిక వస్త్రాలు, కలశ వస్త్రాలు, ధ్వజారోహణ వస్త్రాలను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధానిలకు దాతల తరపున ఐకేపీ ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, సౌజన్య దంపతులు అందించారు.


ఈఓ, పండితులకు వస్త్రాలు అందిస్తున్న తిరుపాల్‌రెడ్డి దంపతులు

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

బండి ఆత్మకూరు: ఉపాధి హామీ కూలీల వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ నాయకులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎంపీడీఓ దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. పెరిగిన నిత్యాసర సరుకుల ధరల నేపథ్యంలో కూలీల వేతనం రోజుకు రూ.600 పెంచి వలసలను నివారించాలని సీఐటీయూ నాయకులు వి.సుబ్బరాయుడు , డేవిడ్ తదితరులు కోరారు.

నాటు సారాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1,500 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ శాఖ ఎస్ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు రూప్‌సింగ్, శంకర్ నాయక్, పోలీసులు కృష్ణయ్య, నాగరాజు, సుధీర్‌కుమార్, మధుసూదన్, ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

నందికొట్కూరు: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనునట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అప్లికేషన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం సర్టిఫికెటు, విద్యార్హత సర్టిఫికెటు ఒరిజినల్ తోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీతో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు హాజరుకావాలన్నారు.

రేపు మున్సిపల్ పరిధిలో..

నందికొట్కూరు: బీసీలు కార్పొరేషన్ లోన్ కోసం దరఖాస్తులు చేసుకున్న మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులు ఈనెల 21న ఇంటర్వ్యూకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. జైకిసాన్ పార్కులో ఉదయం 10 గంటలకు బ్యాంకు మేనేజర్ల సహకారంతో ఇంటర్వ్యూలు నిర్వహిచనున్నామన్నారు.

పశుగణన పరిశీలన

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో జరుగుతున్న పశుగణనను ఆళ్లగడ్డ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు రమణయ్య క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. బుధవారం స్వయంగా రైతుల గృహాల వద్దకు వెళ్లి పశువుల గణనపై ఆరా తీశారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో అన్ని పశు వైద్యశాల పరిధిలో పశుగణన కార్యక్రమం 90 శాతం పూర్తయ్యిందని చెప్పారు. ఏడీఏ వరప్రసాద్, పశు వైద్యాధికారులు రవీంద్రనాథ్‌రెడ్డి, నాగశైలజ, మహాలక్ష్మి పాల్గొన్నారు.


ఇంజేడులో పశుగణన వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీడీ రమణయ్య

వంతెన నిర్మాణ పనులు అడ్డుకున్న గ్రామస్తులు


పనులను అడ్డుకుంటున్న ప్రజాప్రతినిధులు, సీపీఎం నాయకులు, ప్రజలు

పాములపాడు: పాములపాడు సమీపంలో నిర్మిస్తున్న అండర్‌పాస్ పనులను బుధవారం చెలిమిల్ల గ్రామస్తులు అడ్డుకున్నారు. సర్పంచులు చెలిమిల్ల కోట్ల చంద్రారెడ్డి, లింగాల మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సురేష్, కోఆప్షన్ ముర్తుజావలి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్, సీపీఎం నాయకులు సోమన్న, బాలయ్య అండర్‌పాస్ వంతెన నిర్మాణం పనులను అడ్డుకున్నారు. వంతెన ఎత్తు పెంచాలని డిమాండ్ చేస్తున్నా కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవటం తగదన్నారు. సత్వరమే అండర్‌పాస్ వంతెన ఎత్తు పెంచి నిర్మించాలని లేకపోతే నిరవధికంగా పనులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

26న సూర్యనందిలో మహాశివరాత్రి వేడుకలు

మహానంది: నందిపల్లె సమీపంలోని సూర్యనందీశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26న మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామానుజన్, కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ 29న మహాశివరాత్రి పురస్కరించుకుని లింగోద్భవం కాలంలో గౌరీ సమేత సూర్యనందీశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఆలయ ఆవరణలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు ఉంటాయన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

పగిద్యాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివమాల దీక్ష చేపట్టిన శివస్వాములు బుధవారం ఇరుముడి ధరించి మహాపుణ్యక్షేత్రం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. నెహ్రూనగర్, పగిద్యాల, ప్రాతకోట తదితర గ్రామాల శివస్వాములు శివనామ స్మరణ జపిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి కదిలారు. మండల దీక్ష, అర్ధమండల దీక్ష చేపట్టిన శివ స్వాములకు బంధువులు నూతన వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి పూజించి సాగనంపారు.


పాదయాత్రతో కదులుతున్న శివస్వాములు

కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలి

మహానంది: గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే నిఘా ఉంచాలని నంద్యాల ఏఎస్పీ ఎం.జావళి ఆల్ఫోన్స్ పోలీసులకు సూచించారు. సీతారామపురంలో కొన్ని నెలల నుంచి ఏర్పాటు చేసిన పోలీస్ ప్యాక్షన్ పికెట్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలో అల్లర్లు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పోలీసు సిబ్బంది ద్వారా గ్రామంలోని స్థితిగతులపై చర్చించి తెలుసుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

గాజులపల్లెలో కొన్ని నెలల క్రితం నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కల్యాణి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై గత ఏడాది డిసెంబర్‌లో కేసు నమోదైంది. ఆమె విచారణ చేసి వివరాలు సేకరించారు.


సీతారామపురంలో వివరాలు సేకరిస్తున్న ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్

శివభక్తులకు మజ్జిగ, పండ్లు, మందుల పంపిణీ

జూపాడుబంగ్లా: మహాశివరాత్రిని పురస్కరించుకుని కాలినడకన శ్రీశైలం వెళ్తున్న శివభక్తులకు తంగడంచ చెక్‌పోస్టు ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం దానధర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ, పండ్లు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా కాలినడకన శ్రీశైలం వెళ్తున్న భక్తులకు తమవంతు ఉడతాభక్తిగా మజ్జిగ, పండ్లు, అటుకులు, మందులు, మంచినీరు తదితరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తంగడంచ గ్రామ శివస్వాములు గోకారి, హరి, మద్దిలేటి, మధు, చిన్న, మహేంధర్, బాలు పాల్గొన్నారు.

లింగందిన్నె చేరిన పార్వేట పల్లకీ

రుద్రవరం: మండలంలోని టీ.లింగందిన్నెలో ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి,ప్రహ్లాదవరదస్వామి వారికి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. పార్వేటోత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకీ టీ.లింగందిన్నెకు చేరుకుంది. బుధవారం స్వామి వారి పల్లకీ గ్రామంలోని పలు తెలుపులపై కొలువుదీరగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి పల్లకీ రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.


టీ.లింగందిన్నెలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు తప్పనిసరి


రైతు విశిష్ట గుర్తింపునకు నమోదు చేయించుకుంటున్న రైతులు

పగిద్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సయుంక్తంగా చేపట్టిన రైతు విశిష్ట గుర్తింపు నమోదు ప్రక్రియను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ సబ్సిడీ పథకాలు పొందాలంటే రైతులకు విశిష్ట గుర్తింపు తప్పనిసరి అని పేర్కొన్నారు. గుర్తింపు సంఖ్య లేకపోతే ప్రభుత్వ సబ్సిడీ పథకాలకు అనర్హులవుతారని తెలియజేశారు. అందువల్ల పొలం పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేసి నమోదు చేసుకోవాలన్నారు.

ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ఈనెల 19 నుంచి 21 వరకు ఏర్పాటు చేయనున్న ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 19న తూడిచెర్ల మెయిన్ స్కూల్, జూపాడుబంగ్లా-2 సచివాలయం, 20, 21 తేదీల్లో రెండు రోజులపాటు తాటిపాడు, పారుమంచాల గ్రామాల సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని స్పందన జాతీయ స్థాయిలో మెడల్ సాధించింది. దీంతో బుధవారం ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ విద్యార్థినితో పాటు పీడీ శ్రీనివాసులును అభినందించారు. ప్రిన్సిపాల్ పాట్లాడుతూ ఈనెల 13,14,15 తేదీల్లో మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొని సత్తా చాటి బ్రాంజ్ మెడల్ సాధించిందని చెప్పారు.


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

క్షయ నిర్మూలనే ధ్యేయం

కొత్తపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పని చేసి, క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎరప్రతం వైద్యాధికారి జబీర్, పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ సూచించారు. బుధవారం ముసలిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దేవస్థానం ఉద్యోగినికి మెమో

మహానంది: మహానంది దేవస్థానంలోని ప్రసాదాల కౌంటర్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అనురాధకు మెమో జారీ చేసినట్లు దేవస్థానం ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల ప్రసాదాల కౌంటర్‌లో ఆమె స్థానంలో ఆమె కుమారుడు విధులు నిర్వహించడం, చిల్లర పేరుతో భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించిన నేపథ్యంలో సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన వార్తలకు అధికారులు స్పందించారు. వివరణ కోరుతూ మెమో జారీ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు ఆమె విధులు మార్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పాములపాడు: మండలంలోని బానకచర్ల గ్రామంలో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రైయినేజీ కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయసుధ ల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు

మహానంది: మహానంది మండలంలోని ఎరువుల డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి యూరియాను ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని ఏఓ నాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుక్కాపురంలోని బైసాని ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఖచ్చితంగా ఫారం ఎం..లోనే బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలన్నారు. యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు.

'రాయలసీమ మాలల గర్జన'ను విజయవంతం చేయండి

కొత్తపల్లి: ఈనెల 23న జరిగే రాయలసీమ మాలల గర్జన సభను రాయలసీమ జిల్లాల్లోని మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలని సమాతసైనిక్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు సగినెల సురేష్, మండల అధ్యక్షుడు నేరేడు పుల్లయ్య కోరారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల, లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, వీరాపురం, గోకవరం, నందికుంట, ఎదురుపాడు, కొక్కెరంచ, కొత్తమాడుగుల, గ్రామాల్లో హలో మాల...చలో కర్నూలు రాయలసీమ మాలల యుద్ధ గర్జన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23న కర్నూలు పట్టణంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను మాలలందరూ విజయవంతం చేయాలన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

23న కుంభాభిషేక మహోత్సవం

కొత్తపల్లి: మండల కేంద్రంలో సీతా రామ లక్ష్మణ ఆంజనేయ ఆలయ ధ్వజ శిఖర ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాన్ని ఈనెల 23 న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పల్లా పడిగలయ్య శెట్టి, కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 23 వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

మిడుతూరు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సిబ్బంది కొరత ఉందని, నియామకానికి చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్పిటల్ ముందు ఉన్న పోరంబోకు స్థలాన్ని హాస్పిటల్‌కు కేటాయించాలని కోరారు. అనంతరం దంతరక్షణ ఓపీని, పిల్లలకు తల్లులు పాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన గదులను ప్రారంభించారు. హాస్పిటల్‌లో ల్యాబ్, రోగుల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య, సహకార సొసైటీ మాజీ అధ్యక్షులు కాతా రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.